ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ  వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 26.11.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. భారత రాజ్యాంగం సజీవ, ప్రగతిదాయక పత్రమని, దీని ద్వారా దేశం సామాజిక న్యాయం, సమున్నత సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను సాధించగలిగిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అన్నారు.
2. ఈరోజు దేశ వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. రాజ్యాంగ ప్రాముఖ్యతపై రాష్ట్రంలో పలు సదస్సులు, సమావేశాలు జరుగుతున్నాయి.
3. రైతుల బంగారు భవిష్యత్తుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు దిశా నిర్దేశం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.
4. కొమురం భీం అసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలం గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా విద్యార్థిని మృతికి నిరసనగా ప్రజా సంఘాలు రేపు జిల్లా బందుకు పిలుపు ఇచ్చాయి.

**రాజ్యాంగ దినోత్సవం - 1**

ఈ రోజు దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. 1949 నవంబర్ 26న ఇదే రోజు భారత రాజ్యాంగాన్నిరాజ్యాంగ సభ ఆమోదించింది. 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. భారత రాజ్యాంగం సజీవ , ప్రగతిదాయక పత్రమని , దీని ద్వారా దేశం సామాజిక న్యాయం , సమున్నత సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను సాధించగలిగిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలో ఈరోజు పార్లమెంట్

సెంట్రల్ హాల్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముర్ము ప్రసంగించారు. సమాజంలోని బలహీన వర్గాలు, వివిధ ఇతర వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న పలు చర్యలను రాష్ట్రపతి ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాజ్యాంగ లక్ష్యాలను ప్రతి ఒక్కరూ ఆచరణలోకి తెచ్చేందుకు కృషి చేయాలని, 2047 నాటికి వికసిత్ భారత్ సాకారం కావడానికి ప్రతి ఒక్కరూ అంకితం కావాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

(బైట్)

**రాజ్యాంగ దినోత్సవం - 2**

పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకుంటున్నారని , దేశంలో ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. లోక్ సభ , రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్లకు సంబంధించి నారీ శక్తి వందన అధినీయంను పార్లమెంట్ ఆమోదించడాన్ని ప్రశంసించారు. ఇది మహిళల సాధికారతలో నవ శకానికి నాంది అని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ , ప్రధానమంత్రి నరేంద్రమోది, లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పలు సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎన్.ఎస్.డి.

**యాడ్ నాగర్ కర్నూల్ - రాజ్యాంగ దినోత్సవం**

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భారత రాజ్యాంగం అన్ని వర్గాల వారికి ప్రాథమిక

హక్కులను ప్రసాదించిందని, ప్రతి ఒక్కరు స్వాతంత్ర ఫలాలను అనుభవించేందుకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగమైన భారత రాజ్యాంగం కల్పించిన అన్ని అవకాశాలను ప్రజలు అందిపుచ్చుకోవాలని అన్నారు.

పిటిసి నాగర్ కర్నూల్

**రాజ్యాంగం - భద్రాద్రి కొత్తగూడెం**

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

**తుమ్మల నాగేశ్వరరావు**

దశాబ్దాలుగా శాస్త్రవేత్తలు , వ్యవసాయ రంగ నిపుణుల చేస్తున్న కృషి ఫలితంగానే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలబడగలుగుతున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. PJTSAU వజ్రోత్సవాలను పురస్కరించుకుని ఆయన ఈరోజు ఫ్లయర్ , లోగోలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ ఉత్సవాలు వ్యవసాయ అభివృద్ధికి మైలురాయిగా నిలవాలన్నారు. వ్యవసాయరంగ పురోభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి వున్నారని, బడ్జెట్ లో 4 వేల 700 కోట్ల రూపాయలను ఈ రంగానికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కేటాయించారని ఆయన గుర్తు చేశారు. కొత్త వంగడాలు , పరిశోధనలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని, రైతుల బంగారు భవష్యత్తుకు దిశానిర్దేశం చేయాలని సూచించారు. విశ్వ విద్యాలయ ఉపకులపతి అల్దాస్ జానయ్య మాట్లాడుతూ... వివిధ పంటలు క్రిమికీటకాల

నుంచి సమర్థంగా తట్టుకునే రీతిలో పరిశోధనలకు తాము ప్రాధాన్యత ఇస్తున్నామని , వాతావరణ మార్పులకు తట్టుకునే కొత్త వంగడాలను అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తలు గట్టి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు.

MSM

**సిద్దిపేట మంత్రి పొన్నం:**

రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఎంతో అభివృద్ధి చేశామని రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నిన్న రాత్రి హుస్నాబాద్ పట్టణంలో జరిగిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సభకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు హుస్నాబాద్ లోని అంబేద్కర్ సర్కిల్ వద్ద 80 మంది కళాకారులతో తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలో అమలు చేస్తున్న పథకాలు సంక్షేమం, అభివృద్ధి చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

–పిటిసి, సిద్దిపేట

**కురియన్ జయంతి**

మన దేశంలో శ్వేత విప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ 103వ జయంతి సందర్భంగా ఈ రోజు జాతీయ క్షీర దినోత్సవాన్ని పాటిస్తున్నారు. క్షీర విప్లవం సాధించడంలో దేశం సాధించిన పురోగతిని , డాక్టర్ వర్గీస్ కురియన్ ఈ రంగానికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నారు.

--ఎన్.ఎస్.డి

**శైలజ మృతి**

గత నెల  29న కొమురం భీం అసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలం గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా శైలజ మృతికి నిరసనగా ప్రజా సంఘాలు రేపు జిల్లా బందుకు పిలుపు ఇచ్చాయి. చికిత్స పొందుతూ హైదరాబాద్ నిమ్స్ లో నిన్న తుది శ్వాస విడిచిన విద్యార్థిని శైలజ మృతిపై జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. ఈ తెల్లవారుజామున మృతదేహాన్ని వాంకిడి మండలం దాబాకు తరలించగా గ్రామస్తులు అంబులెన్స్ ను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండేవిటల్  , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అక్కడికి చేరుకొని వారికి ఒప్పించి బాధితురాలి కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం , ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కాగా, దాబా గ్రామానికి వెళ్లకుండా బిఆర్ఎస్ నాయకులను రాత్రి నుండి ఎక్కడికి అక్కడ గృహ నిర్బంధాలు చేశారు. మృతురాలి స్వగ్రామానికి మీడియాతో పాటు బయటి నుండి వచ్చే ఎవరిని కూడా పోలీసులు అనుమతించడం లేదు.

పిటిసి ఆసిఫాబాద్

**<u>మహబూబాబాద్</u>**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు. మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో  మహిళా శక్తి క్యాంటీన్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

పిటిసి మహబూబాబాద్

**<u>కళ్యాణ లక్ష్మి చెక్కులు</u>**

మేడ్చల్ మల్కాజ్ గిరిజిల్లా, కూకట్ పల్లి తహసిల్దార్ కార్యాలయంలో  తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి,  ఈ రోజు 504 మంది  లబ్ధిదారులకు 5 కోట్ల  రూపాయల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

--పిటిసి, మేడ్చల్  మల్కాజిగిరి.

**మహిళల వసతి గృహం:**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలో 31 గదులతో మహిళా ఉద్యోగులు , విద్యార్థినుల కోసం వసతి గృహాన్ని ఏర్పాటు చేసినట్టు , వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ జిల్లా మేనేజర్ సుధారాణి తెలిపారు.

---పిటిసి, రాజన్న సిరిసిల్ల

**చలి....**

రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. దీనితో పలు ప్రాంతాల ప్రజలు చలిగుప్పిట్లో వణుకుతున్నారు. మంచిర్యాల జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలి తీవ్రత పెరుగుతుం ది. జిల్లాలో అత్యల్పంగా హాజీపూర్ లో 11.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా జన్నారం , కాసిపేట, లింగాపూర్ ప్రాంతాల్లో 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రానున్న మరో మూడు రోజుల పాటు జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది... . సంగారెడ్డి జిల్లా కోహిర్ లో కూడా చలి తీవ్రత కొనసాగుతోంది.

-పిటిసి, మంచిర్యాల, సంగారెడ్డి

**యాదాద్రి ....**

కార్తీకమాసం సందర్భంగా ఈ నెల 29న యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో గల దేవస్థాన తోటలో ఉదయం పదిన్నర గంటలకు తులసీ దామోదర కళ్యాణం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం , కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు.

--పిటిసి, యాదగిరి గుట్ట

**యాదాద్రి రోడ్డు పనులు**

యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలో సిసి రోడ్డు పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. యావపూర్ నుంచి తూముకుంట వరకు బిటి రోడ్డు పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్.ఎల్.ఏ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

పిటిసి యాదాద్రి

**నల్లగొండ**

దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు... నల్గొండ జిల్లా నకిరేకల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి కలక్టర్ ప్రారంభించారు.

పిటిసి, నల్లగొండ